

# నవభూమి కరీంనగర్

అనుబంధం

గురువారం 31 అక్టోబర్,2024 పేజీలు:3

www.epaper.navabhoomi.in


## 6 నుంచి సమగ్ర

# కుటుంబ సర్వే



**పెద్దపల్లి, -నవభూమి:** రాష్ట్రంలో వచ్చే నెల 6 నుంచి నిర్వహించే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పకడ్బందీగా చేయాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం ఆయన మధిర తహసీల్దార్ కార్యాలయం నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతికుమారి,ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే (సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే) నిర్వహణ విధివిధానాలను క్యాబినెట్ సమావేశంలో చర్చించి ఆమోదించామన్నారు. ఈ సర్వేలో ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి రాజకీయ, కుల వివరాలను సేకరిస్తామన్నారు. ప్రజా ప్రభుత్వం ఉన్నతమైన ఆలోచనతో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపడుతోందని, ఎస్సీ, ఎస్టీ ఇతర బలహీన వర్గాల అభ్యున్నతి కోసం వివిధ సామాజిక, ఆర్థిక, విద్య ఉపాధి, రాజకీయ అవకాశాల వారికి మెరుగుపరచడానికి ప్రణాళికలు తయారుచేసేందుకు సర్వే ఉపయోగిస్తామన్నారు.కుటుంబ సర్వే నిర్వహణకు ప్రతి మండలానికి ఒక జిల్లా స్థాయి అధికారులు నోడల్ అధికారిగా నియమించాలని, ఎన్యుమరేటర్ సూపర్‌వైజర్‌లకు అవసరమైన శిక్షణ అందించాలన్నారు. సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం సమ న్వయంతో సర్వేను విజయవంతం చేయాలన్నారు. సిద్దిపేట నుంచి పాల్గొన్న బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సర్వే నిర్వహణ చరిత్రలో నిలిచిపోయే ప్రక్రియ అవుతుందన్నారు. నల్గొండ నుంచి పాల్గొన్న రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సర్వే నిర్వహణ షెడ్యూల్ ప్రజలకు తెలిసేలా విస్తృ త ప్రచారం కల్పించాలన్నారు. సర్వే పూర్తి చేసిన ఇంటికీ స్టిక్కర్ అంటించాలన్నారు. నవంబర్ నెల చివరి వరకు ప్రతి ఇంటి సర్వే పూర్తిచేసి వివరాలు ఆన్‌లైన్‌లో పక్కా గా నమోదు చేయాలని అన్నారు. మంత్రి జూపల్లి కృష్ణా రావు మాట్లాడుతూ ఎన్యుమరేటర్‌లతో ఇంటింటి సర్వే నిర్వహించడం ఎంత ముఖ్యమో, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి డాటా ఎంట్రీ వివరాలను ప్రాప్తి చేయడం అంతే ముఖ్యమని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జె అరుణశ్రీ, జిల్లా అధికారులు, సంబంధిత, అధికారులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కుల

# సాధన కోసం కృషి




**కమాన్ పూర్: -నవభూమి:** కార్మికుల హక్కుల సాధన కోసం కృషి చేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి ఛైర్మన్ జనక్ ప్రసాద్ అన్నారు. రామగిరి మండలం సెంటినరీ కాలనీ లోని శ్రీపాద భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.సింగరేణి కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల హక్కుల సాధన కోసం ప్రత్యేకంగా సింగరేణి కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ లేబర్ యూనియన్ ప్రారంభించామన్నారు.. రూపాయి చెల్లించకుండా రూ.30 లక్షల ప్రమాద భీమా సౌకర్యం బ్యాంకర్ల తో మాట్లాడి ఇప్పించామన్నారు. దీనిని త్వరలో రూ.40 లక్షలు చేసేలా కృషి చేస్తామని అన్నారు. అంతే కాకుండా కాంట్రాక్ట్ కార్మికుల రిటైర్మెంట్ వయసు 60 నుంచి 61 పెరిగేలా చూస్తామన్నారు. పలువురు కార్మికులు సంఘంలో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం దానికి సంబందించిన లోగో ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరసింహ రెడ్డి పాల్గొన్నారు.

## ఇంటింటి సర్వేను

# పక్కాగా నిర్వహించాలి




2


# ప్రతిపాదనలు ఘనం..ప్రగతి గగనం




2

## తగ్గని దగ్గు!



**పెద్దపల్లి, -నవభూమి:** అస్వస్థతకు గురైన ముత్తారం కేజీబీవీ విద్యార్థుల్లో ముగ్గురిని దగ్గు తీవ్రత తగ్గకపోవడంతో మంగళవారం ఉదయం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.తీవ్రమైన దగ్గుతో 53 మంది విద్యార్థినిలు ఆదివారం రాత్రి పెద్దపల్లి ఆస్పత్రిలో చేరగా.. ఆరోగ్యం కుదుట పడటంతో సోమవారం 39 మందిని, మంగళవారం 6 గురిని డిశ్చార్జి చేశారు. 8 మందిలో నలుగురికి దగ్గు తీవ్రత తగ్గకపోవడంతో సోమవారం రాత్రి కరీంనగర్‌కు తరలించారు. అక్కడ కూడా ఆరోగ్య పరిస్థితి మెరుగు పడకపోవడంతో మంత్రి శ్రీధర్‌బాబు సూచన మేరకు రేవతి, సునీత, రక్షితలను హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రికి తరలించినట్లు జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్, డీసీహెచ్ శ్రీధర్‌లు తెలిపారు. ఈ ముగ్గురితో పాటు కరీంనగర్‌లో చికిత్స పొందుతున్న ఆరాధ్య, పెద్దపల్లిలో చికిత్స పొందుతున్న నలుగురి ఆరోగ్యంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు.కారణాలేమిటి? ముత్తారం కేజీబీవీ సమీపంలో పంచాయతీ డంపింగ్‌యార్డు ఉండటం, తరచూ లీకవుతున్న పాఠశాల సెప్టిక్ ట్యాంక్ నుంచి వాసన కారణంగానే విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు అధికారులు చెబుతున్నారు. డంపింగ్‌యార్డు కొనేళ్ల నుంచి ఉంటుండగా.. ఎప్పుడు ఇలాంటి ఘటనలు జరగలేదు. డంపింగ్‌యార్డు వల్లే అయితే 300 మంది విద్యార్థుల్లో కొందరు మాత్రమే అస్వస్థతకు గురవడం అనుమానాలకు తావిస్తోంది. విద్యార్థుల నుంచి రక్త నమూనాలు సేకరించిన అధికారులు సాధారణ పరీక్షలే చేయించారు. దగ్గుకు కారణం.. పాఠశాల ఆవరణలో గడ్డి మందు పిచికారీ చేసిన పిచ్చిమొక్కలను విద్యార్థులచే ఎందుకు తొలగించారనే అంశాలపై విచారణ చేయకపోవడం సందేహాలకు ఆస్కారమిస్తుంది.

## ఉచిత శిక్షణ.. ఉద్యోగాల సాధన

**సిరిసిల్ల -నవభూమి:** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బీసీ స్టడీ సర్కిల్ నిరుద్యోగులకు వరంగా మారింది.అభ్యర్థులు ఉద్యోగాల సాధనకు అవసరమైన సదుపాయాలను కల్పిస్తున్నారు. మెరుగైన వసతులు ఉండటంతో స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందిస్తున్నారు. సివిల్స్ దగ్గర నుంచి అన్ని రకాల ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమయ్యేందుకు శిక్షణ ఇస్తున్నారు. దీనిని సద్వినియోగం చేసుకుంటూనే కొందరు ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు స్టడీ హాల్‌లో సాధన చేస్తున్నారు. వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపులు ఏర్పాటు చేసి ఉద్యోగ రంగాలకు సంబంధించిన సమాచారం, ప్రకటనలు చేరవేస్తున్నారు. స్టడీ సర్కిల్‌లో ఉచిత వైఫై కూడా అందుబాటులో ఉంచారు. వీటిని సద్వినియోగం చేసుకుంటూ పలువురు ఉద్యోగాలు సాధించి ఇతరులకు ఆదర్శంగా నిలిచారు.సిరిసిల్లలో 2022 మార్చిలో ప్రారంభించారు. ఇప్పటి వరకు 510 మంది శిక్షణ పొందారు.ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన పోటీ పరీక్షల్లో పలువురు అభ్యర్థులు ఉద్యోగాలు సాధించారు. డీఎస్సీలో ఎస్జీటీలో 11 మంది ఉద్యోగం సాధించారు. స్కూల్ అసిస్టెంట్ 4, టీజీటీ 2, పీజీటీ 2, జూనియర్ లెక్చరర్ 1, సివిల్ ఎస్సైలు 2, కానిస్టేబుల్ 7, గ్రూప్స్ ప్రిలిమ్‌లో 24 ఎంపికయ్యారు.



## ప్రతిపాదనలు ఘనం..

# ప్రగతి గగనం

**పెద్దపల్లి -నవభూమి:** బల్దియాల్లో వెంటాడుతున్న నిధుల కొరత పాతజెండా ప్రాంతంలో రహదారి విస్తరణకు కూల్చిన ఇళ్లు.. ఈ ప్రాంతంలో సీసీ రహదారి నిర్మించాల్సి ఉంది పురపాలక, నగరపాలక బడ్జెట్ కేటాయింపులకు, నిధుల విడుదలకు పొంతన ఉండటం లేదు.ప్రభుత్వం నుంచి ఆశించిన స్థాయిలో ప్రోత్సాహం లేకపోవడం, సాధారణ నిధులను ఇతర అవసరాలకు మళ్లిస్తుండటంతో అభివృద్ధికి అవరోధంగా మారింది. ఆర్థిక సంస్థల నిధుల లభ్యత అంతంత మాత్రంగానే ఉండటంతో నిర్వహణ భారమైంది. బడ్జెట్‌లో ప్రతిపాదించిన ఆదాయం సమకూరకపోవడం, ఆస్తి పన్ను వసూళ్లలో ఇబ్బందులు తదితర సమస్యలతో పాటు ప్రభుత్వ గ్రాంట్లు కూడా సకాలంలో రావడం లేదు.పెద్దపల్లి పట్టణంలో పలు అభివృద్ధి పనులు నిధుల కొరతతో నిలిచిపోయాయి. బంధంపల్లిలో వైకుంఠధామం నిర్మాణం అర్ధంతరంగా నిలిచిపోగా, నిట్టూరు రోడ్డులోని మరో వైకుంఠధామానికి రూ.కోటి నిధులు విడుదలైనప్పటికీ పనులు మొదలు కాలేదు. రూ.2.75 కోట్లతో చేపట్టిన సమీకృత మార్కెట్ సముదాయ నిర్మాణం కూడా అసంపూర్తిగా నిలిచింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో టీయూఎఫ్ఐడీసీ నిధులతో చేపట్టిన పనులు నిధుల కొరతతో రద్దయ్యాయి.నిధుల మళ్లింపు అసలే నిధుల కొరత వెంటాడుతుండగా పురపాలిక భవనానికి సామర్థ్యానికి మించి నిధులు వెచ్చించడం గుదిబండగా మారింది. 2013లో రూ.2 కోట్ల అంచనాతో భూమిపూజ నిర్వహించారు. అనంతరం 2017లో అంచనా వ్యయం పెంచి రూ.3.50 కోట్లతో మరోసారి శంకుస్థాపన చేశారు. రెండు సార్లు ఇద్దరు మంత్రుల చేతుల మీదుగా శిలాఫలకాలు ఆవిష్కరించారు. నిర్మాణానికి కేవలం రూ.21 లక్షలు మాత్రమే విడుదల కాగా వ్యయం రూ.5 కోట్లకు పెరిగింది. గుత్తేదార్లకు రూ.2 కోట్ల వరకు చెల్లించాల్సి ఉండగా మిగతా సొమ్మును సాధారణ, ఎల్ఆర్ఎస్ నిధుల నుంచి వెచ్చించారు.పెండింగ్ బిల్లులు.. రూ.77.36 లక్షలు సుల్తానాబాద్: సుల్తానాబాద్ పురపాలక సంఘానికి వివిధ పన్నుల ద్వారా ఏటా దాదాపు రూ.92.15 లక్షల ఆదాయం సమకూరుతోంది. బడ్జెట్ ప్రతిపాదనల మేరకు ప్రభుత్వ గ్రాంట్ల ద్వారా రూ.5 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులు, పట్టణ ప్రగతి కింద రూ.19.30 లక్షలు, అమృత్ రూ.18.40 కోట్లు, ఎస్డీఎఫ్ రూ.10 లక్షలు రావాల్సి ఉంది. నిధులు మంజూరు కాక పట్టణ ప్రగతి, ఎస్డీఎఫ్ పనులు నిలిచిపోయాయి. చేసిన పనులకు సంబంధించి గుత్తేదార్లకు రూ.77.36 లక్షలు చెల్లించాల్సి ఉంది.నిలిచిన సమీకృత మార్కెట్ నిర్మాణం పనులు నగరపాలిక ఆదాయం నిర్వహణకే సరి గోదావరిఖని పట్టణం: రామగుండం నగరపాలక ప్రాంతంలో పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వ నిధులు విడుదల కాకపోవడంతో అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఇందులో రెండు సమీకృత మార్కెట్ భవనాలు,





సామాజిక భవనాలు, అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం, బహుళ ప్రయోజనకర భవనం తదితర నిర్మాణాలున్నాయి. ఒక్కొక్క భవనానికి రూ.కోటి నుంచి రూ.8 కోట్ల వరకు మంజూరు చేశారు. రూ.కోటికి పైగా వెచ్చించి పనులు చేసినా బిల్లులు రాకపోవడంతో గుత్తేదార్లు పనులు వదిలేశారు. నగరపాలిక నిధులతో చేపట్టిన పనులకు కూడా బిల్లులు రావడం లేదు. నగరంలో దాదాపు రూ.8 కోట్ల వరకు బకాయిలున్నాయి. వివిధ రకాల పన్నులతో వచ్చే సాధారణ ఆదాయం ఒప్పంద కార్మికుల వేతనాలు, నగరపాలిక నిర్వహణకే సరిపోతోంది. ఇప్పటికే పనులు నిలిచిపోగా కొత్తగా అభివృద్ధి పనులను ప్రకటిస్తూ, ప్రారంభించడం గమనార్హం.

## ఇంటింటి సర్వేను పక్కాగా నిర్వహించాలి

**సుల్తాన్‌బాద్, -నవభూమి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న కుటుంబాల సామాజిక, ఆర్థిక, విద్యా స్థితిగతుల సర్వేను పక్కాగా నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధం కావాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం కలెక్టర్ సుల్తానాబాద్ మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి త్వరలో చేపట్టనున్న ఇంటింటి సర్వే నిర్వహణ సన్నద్ధతను తనిఖీ చేశారు. తహసీ ల్దార్ మదుసూధన్‌రెడ్డి, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, మున్సిపల్ మేనేజర్ అలీమొద్ది న్ తదితరుల నుంచి సర్వేకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇందుకు ఎలాంటి ఏర్పాట్లు చేసుకున్నారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల కుటుంబాల ఆర్థిక, విద్య, సామాజిక స్థితిగతులను తెలుసుకునేందుకు ఇంటింటి సర్వేను చేపట్టాలని ప్రభు త్వం నిర్ణయించిందని, ఇందుకుగాను జిల్లా స్థాయిలో అధికార యంత్రాంగం తగిన ఏర్పాట్లలో ఉందని అన్నారు. మున్సిపాలిటీలలో, మండలాలలో అన్ని రికార్డులు సర్వేకు సంబంధించిన వివరాలను సన్నద్ధం చేసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు అధికారులు తయారు చేసిన రికార్డులను కలెక్టర్ పరిశీలించారు. ప్రతీ 150 కుటుంబాలను సర్వే చేసేందుకు ఒక ఎన్యూమరేటర్‌ను ఎంపిక చేయాలని, ఎన్యూ మరేటర్‌లకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలు ఎప్పటికపుడు కొనసాగించాలని సూచించారు. అలాగే ఇంటింటి సర్వే నిర్వహించే ఎన్యూమరేటర్లకు అవసరమైన పరికరాలు, రూట్ మ్యాప్‌లు తదితర వాటిని అందించాలని అన్నారు. ఏది ఏమైనా ప్రభుత్వం నిర్దేశించిన మేరకు కుటుంబాల ఆర్థిక సామాజిక విద్యా స్థితిగతుల వివ రాలను పక్కాగా సేకరించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



# ఇక్కడ అధ్వానం.. పక్కన అద్దంలా

**ముస్తాబాద్-నవభూమి:** రెండు జిల్లాలను అనుసంధానం చేసే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది.దీంతో వాహనదారులు, ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. అయినా పట్టించుకున్న నాథుడు లేడు. జిల్లా పరిధిలో ఉన్న ఇదే రహదారి గుంతలు పడి రవాణాకు ఇబ్బందికరంగా మారగా, పక్క జిల్లా పరిధిలో మాత్రం అద్దంలా మారింది. అక్కడి నేతలు ప్రజల కల నెరవేర్చినా, ఇక్కడి ప్రజాప్రతినిధులు పట్టించుకున్న పాపానపోలేదు. దీంతో రవాణా కష్టాలు తీరలేదు.ముస్తాబాద్ మండల కేంద్రం నుంచి దుబ్బాక వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. ఏళ్లుగా ఇదే పరిస్థితి ఉంది. రోడ్డుకు మోక్షం ఎప్పుడు వస్తుందోనని ఇరు జిల్లాల వాహనదారులు, ప్రజలు ఎదురుచూస్తున్నారు.ముస్తాబాద్-దుబ్బాక రోడ్డు కోసం అప్పటి ప్రజాప్రతినిధులు ప్రభుత్వానికి నివేదించారు. ఎట్టకేలకు అప్పటి మంత్రి కేటీఆర్ చొరవతో ముస్తాబాద్ నుంచి మోహినికుంట మీదుగా దుబ్బాక వరకు 2023 జనవరిలో రహదారి మంజూరు చేశారు.ముస్తాబాద్ నుంచి దుబ్బాక వరకు 14 కిలోమీటర్లకుగాను రూ. 26 కోట్లు కేటాయించారు. దుబ్బాక నుంచి రాజక్కపేట శివారు వరకు 8.4 కిలోమీటర్లకు గాను రూ. 12 కోట్లు విడుదల కాగా పనులు ప్రారంభించి పూర్తి చేశారు.ముస్తాబాద్ నుంచి మోహినికుంట శివారు వరకు 5.6 కిలో మీటర్ల రహదారికి గాను రూ. 14 కోట్లు కేటాయించారు. 2023 జనవరిలో నిధులు మంజూరు కాగా, 2024 ఫిబ్రవరిలో వెనక్కి మళ్లాయి.భారాస హయాంలో నిధులు రాగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రద్దు అయ్యాయి. పనులు చేపట్టకపోవడంతో ఈ సమస్య నెలకొంది. మళ్లీ నిధుల కోసం కృషి చేసిన నాథుడు కనిపించడం లేదు. దీంతో రహదారి పనులకు ఎప్పుడు మోక్షం కలుగుతుందో తెలియని దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని నిధుల కోసం కృషి చేయాలని రెండు జిల్లాల ప్రజలు కోరుతున్నారు.రాజక్కపేట నుంచి దుబ్బాక వరకు పూర్తయిన రహదారి ప్రతి చిన్న పనికీ మండల కేంద్రానికి రావాలి మాది సరిహద్దు గ్రామం. చిన్న గ్రామం కావడంతో ప్రతి పనికీ, నిత్యావసర వస్తువుల కోసం మండల కేంద్రానికి రావాలి. మండల కేంద్రం నుంచి మా గ్రామ శివారు వరకు రహదారి బాగాలేదు. రాత్రనక, పగలనక మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తాం. రాత్రి వేళలో వాహనదారులు రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. భారాస హయాంలో నిధులు వచ్చాయి. పనులు చేపట్టకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది. అప్పుడే పనులు ప్రారంభిస్తే లక్ష్యం నెరవేరేది.





## కల సాకారానికి ఆర్థిక అడ్డంకులు



**శంకరపట్నం-నవభూమి:** ఆరో తరగతి చదువుతున్న సమయంలో తండ్రి రోడ్డు ప్రమాదానికి గురై మృత్యుఒడి నుంచి బయటపడ్డారు. అప్పుడే తమ ఇంట్లో ఓ డాక్టర్ ఉంటే బాగుంటుందని తలచింది ఆ విద్యార్థిని.అదే ఆశయంతో చదువుపై దృష్టి సారించింది. ఇటీవల బీడీఎస్ సీటు సాధించినా ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా ముందుకు సాగలేకపోతోంది.విశాఖపట్నంకు చెందిన గురుబెల్లి అరుణ-సూర్యారావు దంపతులు 25 ఏళ్ల కిందట శంకరపట్నం మండలం కొత్తగట్టుకు వచ్చి గ్రామంలో స్థిరపడ్డారు. సూర్యారావు ఓ గ్రానైట్ క్వారీలో సీపీ ఆపరేటర్‌గా పని చేస్తున్నారు. చిన్న కుమార్తె కావ్య.. స్థానిక ఉన్నత పాఠశాలలో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదివింది. 2021లో పదో తరగతిలో పది జీపీఏ సాధించింది. టీఎస్ డబ్ల్యూఆర్ఈఐఎస్ మడికొండలో సీటు సాధించి ఇంటర్ బైపీసీలో 971 మార్కులు సాధించింది. ఆర్‌జీ రావు ట్రస్ట్ సాయంతో శిక్షణ పొంది నీట్ పరీక్షలో 482 మార్కులతో 2,46,735 ఆల్ ఇండియా ర్యాంకుతో ఖమ్మంలోని ప్రైవేటు వైద్య కళాశాలలో బీడీఎస్‌లో ప్రవేశం పొందింది. ప్రస్తుతం కళాశాలలో ట్యూషన్, మెడికల్ ఇతరత్రా ఫీజులకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని సూర్యారావు-అరుణ దంపతులు వాపోయారు. డాక్టర్ కావాలన్న తమ కుమార్తె కల సాకారానికి దాతలు చేయూత అందించాలని వేడుకుంటున్నారు.

## చీకటి వెలుగుల రంగేళి.... జీవితమే ఓ దీపావళి

**కరీంనగర్-నవభూమి:** ఆశ్వయుజ బహుళ అమావాస్యనాడు వచ్చేది దీపావళి. ధన త్రయోదశి నాడు బంగారం కొనడం, చతుర్దశి నాడు మంగళ హారతులు, దీపావళి నాడు ధనలక్ష్మి పూజలు చేస్తారు. ఈ యేడు గురువారం మధ్యాహ్నం చతుర్దశి ఉంటూ 2 గంటల నుంచి అమావాస్య వస్తోంది. గురువారమే దీపావళి పండుగ, ధనలక్ష్మి పూజలు జరుపుకోనున్నారు. శుక్రవారం స్వాతి నక్షత్రంతో కూడిన అమావాస్య ఉండడంతో నోములు నోచుకోనున్నారు. వ్యాపార గృహ సముదాయాల్లో పూజల అనంతరం టపాసులు కాలుస్తారు. ప్రతి ఇల్లు కొత్త అల్లుళ్లతో సందడిగా మారగా ఇంటిల్లిపాది పిండి వంటలు తింటూ కబుర్లతో కాలక్షేపం చేస్తారు. పడిపోయిన, కొత్తవి, పంచకునే నోములు శుక్రవారం ఆచరించవచ్చని పండితులు చెబుతున్నారు.దీపావళి పండగ వెనుక ఇతిహాసం..ద్వాపర యుగంలో ప్రాగ్జోతిష్యపురం రాజధానిగా నరకాసురుడు పరిపాలన చేస్తూ దేవ, మానవ జాతిని ఇబ్బందులకు గురి చేసేవాడు. ధర్మానికి భంగం కలిగించే పనులకు సహించని భూమాత, దేవతలు, ప్రజలు, శ్రీకృష్ణుడికి విన్నవించుకుంటారు. కృష్ణుడు సత్యభామతో కలిసి ఆశ్వయుజ చతుర్దశి నాడు నరకుడిని అంతం చేస్తారు. అది నరక చతుర్దశి. నరకాసుర వధానంతరం వచ్చిన సత్యభామ కృష్ణులకు అమావాస్య (చీకటి రోజు) నాడు ప్రజలు దీపాలను వెలిగించి మంగళహారతులు, భాజాభజంత్రీలుతో స్వాగతం పలుకుతారు. ఆనాటి నుంచి దీపావళిగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది.దీపాల వెలుగులు- టపాసుల మోతలు..దీపావళి అనగానే వివిధ ఆకృతుల్లో ఉన్న ప్రమిదల్లో దీపాలు వెలిగిస్తారు. వరుసలుగా దీపాలు వెలిగించి ఆ కాంతుల మధ్య వెలిగి పోతున్న గృహాలను చూసుకొని మురిసి పోతారు. అమావాస్య తిథి లక్ష్మీదేవికి ఇష్టం కావడంతో దీపాలు వెలిగించి అమ్మ వారికి పూజలు చేసి ఆహ్వానిస్తే ధనలక్ష్మి కృప ఉంటుందని విశ్వాసం.పూజల అనంతరంవివిధ రకాల టపాసులను, బాంబులను చిన్నా పెద్ద తేడా లేకుండా కాల్చి ఆనందోత్సాహాలతో పండుగ జరుపుకుంటారు.గురువారం మధ్యాహ్నం వరకు చతుర్దశి తిథి ఉన్నందున దేవుని వద్ద మంగళ హారతి వెలిగించాలి. ఆడపడచులు హారతులిచ్చి దిష్టి తీయగానే తలంటు స్నానాలు చేసి నూతన వస్త్రాలు ధరించి లక్ష్మీపూజ చేసి నైవేద్యం సమర్పించాలి. అమావాస్య తిథి గురువారం మధ్యాహ్నం వస్తుండడంతో మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి వరకు దీపావళి పూజలు జరుపాలి. నోములు, వ్రతాలున్న వారు కేదారీశ్వర, సత్యనారాయణ స్వామి వ్రతాలు శుక్రవారం ఆచరించవచ్చు.

## కొనుగోలుకు ముందే పేలుతున్న టపాసులు

**కరీంనగర్ -నవభూమి:** జిల్లా కేంద్రంలోని మార్కెట్‌లో మంగళవారం దీపావళి టపాసులు, పూజా ద్రవ్యాల కొనుగోళ్ల సందడి నెలకొంది. మార్క్‌ఫెడ్ గ్రౌండ్, అంబేద్కర్ స్టేడియం, పద్మనగర్, ప్రకాశంగంజ్, నగర శివారు ప్రాంతాల్లో టపాసుల అమ్మకాలు జరుగుతున్నాయి. నెలలో చివరి రోజులు కావడంతో మంగళవారం రాత్రికి అమ్మకాలు మందకొడిగానే సాగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ధరలు పేలుతున్నా కొనక తప్పడం లేదని వినియోగదారులు అంటున్నారు. టపాసుల ధర కిలోకు 550 నుంచి 700 వరకు రూపాయల వరకు పలుకుతుంది. విడిగా అన్ని రకాలు కలిపి కొంటే తక్కువలో తక్కువ 2,500 రూపాయల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. వినియోగదారులు తాహతుకు తగ్గట్లుగా కొనుగోలు చేస్తున్నారు. థౌజండ్ వాలా, ఫైథౌజండ్ వాలా సింగిల్, డబుల్ షాట్స్, రాకెట్స్, తారాజువ్వలు, సైరన్ టపాసులు, ఉల్లిగడ్డ, లక్ష్మీబాంబులకు గిరాకీ పెరిగింది. ఖర్చులు, రవాణా చార్జీలు పెరగడంతో ధరలు పెంచక తప్పడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. పూజాద్రవ్యాల సామాగ్రికి గిరాకీ పెరిగింది. పూలు, పండ్లు, పూజలకు, నోములకు కావాల్సిన వస్తువుల కొనుగోళ్లు బాగానే సాగుతున్నాయి. గుమ్మడికాయ 80 నుంచి 150 వరకు, పూలు మూరకు 25 చొప్పున అమ్ముతుండగా విడిపూలు విభిన్న రకాలను బట్టి 30 నుంచి 60 రూపాయల వరకు అమ్ముతున్నారు. బంతి, చేమంతి పూలను కుప్పలుగా పోసి అమ్ముతున్నారు. 100 గ్రాములకు 50 రూపాయల నుంచి 70 వరకు పలుకుతున్నాయి. పూజలకు అమ్మకందారులు వేటికవే ప్యాక్‌చేసి అమ్ముతున్నారు. ఒక్కో ప్యాక్ ఆయా పూజకు సంబంధించి 1,500 రూపాయల నుంచి రెండు వేల రూపాయల వరకు అమ్ముతున్నారు. ఆయాచోట్ల రకరకాల ప్రమిదలతోపాటు వత్తులు, నూనె అమ్మడంతో అన్నీ ఒకే చోట కొనుగోలు చేస్తున్నారు. దీపపు ప్రమిదలు, టపాసులు, పూజాసామాగ్రి అమ్మకాలతో మార్కెట్‌లో సందడి నెలకొంది.



## పెద్దపల్లి మార్కెట్‌లో ఈ-నామ్ కొనుగోళ్లు ప్రారంభం



**పెద్దపల్లి, -నవభూమి:** పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళ వారం ఈ-నామ్ ద్వారా పత్తి కొనుగోళ్లను ఆరంభించారు. ఇప్పటి వరకు వ్యాపారులు నేరుగా రైతుల కుప్పల వద్దకు వచ్చి వేలంపాటలు నిర్వహించి ధరలు నిర్ణయించగా, ఇప్పుడు ఆన్‌లైన్ ద్వారా ధరలను నిర్ణయిస్తున్నారు. ఈ-నామ్ కొను గోళ్ల ప్రారంభం అవుతున్నాయనే సమాచారంతో రైతులు పెద్ద ఎత్తున మార్కెట్‌కు పత్తిని తీసుకవచ్చారు. 332 మంది రైతులు 1052సంచుల్లో 1157.20 క్వింటాళ్ల పత్తి ని తీసుకవచ్చారు. క్వింటాలు పత్తికి అత్యధికంగా 6,650 రూపాయలు, అత్యల్పంగా 5,811 రూపాయల ధర పలికింది. మోడల్ ధర 6,411 ఉంది. 6 వేల రూపాయల వరకు 53మంది రైతుల నుంచి 176క్వింటాళ్ల పత్తిని వ్యాపారులు కొనుగోలు చేయ గా, 6001 నుంచి 6,500 రూపాయల వరకు 228 మంది రైతుల నుంచి 767.80 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. 6501 నుంచి 7వేల రూపాయలలోపు 194 మంది రైతుల నుంచి 213.40 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. మద్దతు ధరకం టే తక్కువ ధరకే వ్యాపారులు పత్తిని కొనుగోలు చేస్తుండడంతో రైతులు తమకు గిట్టుబాటు ఏమోగానీ, మద్దతు ధరలు కూడా దక్కడం లేదని రైతులు ఆవేదన వ్య క్తం చేస్తున్నారు. పత్తిలో తేమ శాతంనిర్ణీత ప్రమాణాలకు మించి 20 శాతం వరకు ఉండడంతో ధర తక్కువ పెడుతున్నారని, పత్తి తెంపిన తర్వాత ఆరబెట్టి మార్కెట్ కు తీసుకరావాలని, తేమ 8శాతానికి మించకుండా ఉండేలా చూసుకోవాలని మా ర్కెట్ కమిటీ ప్రథమ శ్రేణి కార్యదర్శి దేవరాజ్ ప్రభ్వీరాజ్ రైతులకు సూచించారు.